# బంగారు సంకెళ్లు



స్వర్ణముఖి నదిని దాటుతున్నాను. స్వర్ణముఖి! ఎంత చక్కని పేరు! ఎవరు నామకరణం చేశారో ఏమో? చాలా దూరం ఆలోచించినట్లుంది. ఆలోచన బాగుంది. పేరు బాగుంది. అయితే ఏనాటికో ఒక నాటికి పేరు గొప్ప ఊరు దిబ్బగా మిగిలి పోతుందని మాత్రం ఊహించలేకపోయినట్లుంది.

ఎందుకా పేరు పెట్టవలసి వచ్చిందంటే ముఖమునందు స్వర్ణం కలిగినదట. నేతి బీరలో నెయ్యి లేదు. అది తెలిసిన సత్యమే. మరి స్వర్ణముఖిలో? ఏముంది? ఏమిలేదు?

ఆలోచించవలసిన విషయమే.

ఈ నదీతీరంలో దేవాలయాలు వాటి నిర్మాణం జరిగిన కాలంలో కూలీలకు కూలీ లేదట. నిజమా? అక్షరాలా నిజమే! అయితే వాళ్లెలా బ్రతికారు?

దినమంతా ఒళ్లొంచి పని చేయడం. ప్రొద్దు క్రుంకుతున్నప్పుడు పని నిలపడం. స్వర్ణముఖి నదిలోకి వెళ్ళడం. ఆ నదిలోని ఇసుకమీద కూర్చోవడం. ఆ ఇసుకను కుప్పలు తోసుకోవడం. తర్వాత ఆ కుప్పకొక నమస్కారం పెట్టి ఆ కుప్పలో వెదకడం. వెదికితే ఫలితం? ఆ దినకూలీగా ఒక బంగారు ముక్క! అదెంత ముక్కంటే శ్రమ ఫలితానికి తగినంత ముక్క. అంటే కష్టానికి తగినంత ఫలితం. వాదాలకు, వివాదాలకు తావులేదు. ఎవరికైనా ఒళ్లు దాచుకోవలసిన అవసరం లేదు. ఏ సాంకేతిక సహాయం లేని ఆ రోజుల్లో అంతంత పెద్ద కట్టడాలు కష్టానికి తగిన ఫలితం దక్కడమే కారణమేమో?

**పులికంటి కృష్ణారెడ్డి కథల్లో రాయలసీమ నుడికారపు సొంపు గుబాళిస్తుంది. పల్లె జీవుల అమాయకత, కష్టసహిష్ణుత, స్నేహశీలత పద పదంలో తరళిస్తాయి.**

కట్టుకథో, కలిగిన కథో వినిపిస్తున్న కథ.

ఆలోచిస్తే అన్వయం కుదురుతున్న కథ.

ఈ సీమలోని నదీనదాల్లో, వంకల్లో వాగుల్లో, బంగారం...రాళ్లల్లో రవ్వల్లో రత్నాలు దొరికినందు వల్లనే రాయలనాటి కాలంలో రతనాల బేరసారాలు సాగి ఉంటాయి.

ఆ తలంపుతో గుండె పొంగింది.

నేతులు తాగిన తాతల మూతుల తలపోత కదా మరి. పొంగకుంటే అది తెలుగు గుండె ఎలా అవుతుంది? పొంగిన గుండె ఊరుకోలేదు. అది నరనరానికి స్వాతిశయాన్ని ఎక్కించింది. ఆ ఉత్సాహంలో ఒళ్లు తెలియని స్థితిలో నదిని దాటుతున్నాను. దాటుతూ ఉంటే ముప్పై ఏండ్ల క్రిందట ఆ నదిని దాటిన సంగతి మనసులో మెదలింది.

అప్పుడైనా ఇప్పుడైనా నదిని దాటింది పడవమీద కాదు. తెప్పమీదకాదు. రాయలసీమ అంత అదృష్టానికి నోచుకోలేదు.

ఈ వాస్తవం పొంగుతున్న గుండెను క్రుంగదీసింది.

ఒక్క క్షణం నిలబడ్డాను. చుట్టూ కలయచూశాను. ఎటువంటి నదికి ఏ గతి పట్టింది! మనిషి ఎంత స్వార్థపరుడు? స్వరూప స్వభావాలనే పూర్తిగా మార్చేస్తున్నాడు. ఆ నదిని ఇప్పుడు దాటుతున్నాను. ముప్పై ఏండ్ల క్రిందట దాటాను.

అప్పుడు చెప్పులోని రాళ్లకు భయపడి...ఆ చెప్పుల్నే తీసి చేత పట్టుకొని...కాలిన ఇసుక మీద కాలూన లేక...ఇసుకలో కూరుకుపోతున్న ఒక పాదాన్ని పైకి లేపితే ఇంకొక పాదం కూరుకొనిపోతూంటే...కాలు తీసి కాలు ముందుకు పెట్టలేక...పైనా క్రిందా కూడా కాలుతూంటే...నోటికి, చేతికి తాళం వేసుకొంటూ దాదాపు మైలు దూరం. నడకా అది? కాదు. తప్పు చేసిన వాడికి నిప్పుల మీద నడవమని విధించిన శిక్ష.

ఇప్పుడు ఈ నది ఇద్దరి నుండి అద్దరికి సిమెంటు రోడ్డు. సిమెంటు రోడ్డు మీద స్కూటర్. స్కూటర్ మీద నేను.

ముప్పై ఏండ్ల క్రిందట కాళ్ళీడ్చుకొంటూ ఈ నదిని దాటడానికి ముప్పుతిప్పలు పడ్డాను. ఇప్పుడు మూడు నిమిషాల్లో దాటాను. ముప్పుతిప్పలు పడిందీ అనుభవమే! మూడు నిమిషాల్లో దాటిందీ అనుభవమే! ఒక అనుభవానికి, మరొక అనుభవానికి మధ్య ఎంత తేడా? అదే ఆలోచిస్తూ నదికి ఆవలి గట్టున నిలబడ్డాను. వెనక్కు తిరిగి చూశాను.


ఉదయ కాంతులు కురుస్తున్నాయి. ఆ కాంతుల్లో తడుస్తున్న ఇసుక రేణువులు బంగారు పొలుకుల్ని తలపింప చేస్తున్నాయి. బాగా మెక్కి తిమ్మిరెక్కి నదికి అడ్డంగా పడి ఉన్న కొండచిలువలా ఉంది సిమెంటు రోడ్డు. వెన్నెల వెలుగు లాంటిదీ ఎండ. ఆ ఎండలో సింగారాలు పోతూ సిమెంటురోడ్డు- ఈ దేశం సాధించిన ప్రగతికి నిదర్శనంగా, గర్వకారణంగా.

గుండెనిండుకు గాలి పీల్చుకొన్నాను. ఎంత తృప్తి! తృప్తిలో ఉన్న ఆనందమే వేరేమో. ఇప్పుడు స్కూటర్ తారురోడ్డు మీద రెట్టించిన వేగంతో ముందుకు దూసుకొనిపోతూ ఉంది.

అలమేలు మంగాపురం దాటి, స్వర్ణముఖి నదిని దాటి, పాడిపేట దాటి కాయంపేట దరిదాపుల్లో పోతున్నాను. ఎర్రబస్సు ఎదురయింది. తొలగుతూ ఆ బస్సును గమనించాను.

లోపల ఉప్పు బస్తాల్ని కూరినట్టు ప్రక్కల్లో కొంత మంది, పట్టుకొని వేలాడుతూ, పైన పాల క్యాన్లు, కూరగాయల బుట్టల్లో కూడా కూర్చొని కొంతమంది, ఇరుచంకల్లో ఇద్దరు బిడ్డల్ని మోసుకొని, ఇద్దర్ని చేతులు పట్టి నడిపించుకొంటూ వెంట కొందరు, ముందు కొందరుగా బిడ్డలతో నడవలేక నడుస్తున్న

చిత్రాలు: పి.ఎస్.బాబు



**ముప్పై ఏళ్ళ క్రిందట కాళ్లీడ్చు కుంటూ ఈ నదిని దాటడానికి ముప్పు తిప్పలు పడ్డాను.**

నిండు గర్భిణిలా ముందుకు పోతూ ఉంది బస్సు.

ఆ ఎర్ర బస్సు ఎదురు పడడంతో మనసు మళ్లీ ముప్పై సంవత్సరాల వెనక్కు వెళ్లింది.

స్వర్ణముఖి నదికి అటువైపు తిరుపతి. ఇటువైపు అక్కడక్కడ విసిరి పారేసినట్లున్న పల్లెలు. పల్లెలు పండిస్తున్నాయి. పట్టణాలు తింటున్నాయి.

పట్టణాలు పడకలమీద ఉండగానే అవసరమైన కాఫీకి పాలు, పడకల మీదికి పోతున్నప్పుడు కావలసిన పండు

వల్లెల్లో నుండి రావాల్సిందే. రావాలంటే అది ఇలా ఎర్ర బస్సుల కాలం కాదుకదా? నెత్తి బరువుల మీద రావాల్సిందే. ఆ నెత్తి బరువులు భళ్ళుమని తెల్లవారేసరికి తిరుపతి చేరు కోవాలంటే కోడికూతలతో పోటీ పడుతూ నిద్ర లేవాల్సిందే. ఆ చల్లటి పూట చెమట కక్కుతూ స్వర్ణముఖిని దాటాల్సిందే.

నెత్తి బరువుల పాలూ వండూ, కూరానారా తిరుపతి మార్కెట్‌లోనో, వీథుల్లోనో డబ్బుగా రూపాంతరం చెందు తుంది. రూపాంతరం చెందిన



**అన్నీ చర్చనీయాంశాలే. కలిసినా, విభేదించినా అవి మా వ్యక్తిగత స్నేహానికి ఎప్పుడూ అడ్డురాలేదు.**

డబ్బు మళ్లీ తిరుపతి బజార్లో వల్లెలకు కావాల్సిన ఉప్పూ పప్పూ, గుడ్డా గుసురుగా మారుతుంది.

పొద్దు నడిమిట్ట కెక్కుతూంది.

అప్పుడు ఎర్రని ఎండ. ఆ ఎండలో ఖాళీ అయిన తట్టా బుట్టా నెత్తిన బోర్లించుకొని ఇంటి ముఖం పట్టడం. ఇల్లు చేరుకోవాలంటే స్వర్ణముఖిని దాటక తప్పదు.

ఆకులలములు పాదాలకు చుట్టుకొని కొందరు, పై గుడ్డల్ని ఇసుక మీద పరుచుకొంటూ కొందరు, పరుగులాంటి నడకలో పరువం మీద ఉన్నవాళ్లు ఆ నదిని దాటుతూంటే 'అయ్యో పాపం' అనిపించేది. వీళ్లంతా ఏ తప్పు చేసి ఈ శిక్ష అనుభవిస్తున్నారో అని మనస్సు విలవిలలాడేది.

ఎప్పుడో ముప్పై ఏండ్ల క్రిందట ఒక్కనాటి అనుభవం. ఆ ఒక్క దినం వాళ్లతో కలిసి నదిని దాటుతున్నప్పుడు తల ప్రాణం తోకకొచ్చింది. ఒక్క దినం నదిని దాటడానికి ఇంత బాధ పడుతున్నామే? మరి మూడు వందలా అరవై రోజులు వీళ్లందరు ఈ యాతన పడుతున్నారే! - అని ఆలోచించేటప్పటికి గుండె బాధగా మూలిగింది.

అదే ఇప్పుడు? ఇంటి ముందర బస్సెక్కుతున్నారు. తిరుపతిలో దిగుతున్నారు. మళ్లీ తిరుపతిలో బస్సెక్కి ఇంటిముందర దిగుతున్నారు.

కోడికూతతో నిద్రలేచి కాలికి కాలు కొట్టుకుంటూ ఆరేడు మైళ్లు నడిచిన వాళ్లు ఇప్పుడు కాలు మీద కాలేసి దర్జాగా కూర్చొని బస్సుల్లో వస్తున్నారు. పోతున్నారు. 'దిగులు పడవద్దన్నా రైతన్నా నువ్వు ధీమాగా బతకాలరో రన్నా!' అని గొంతెత్తి అరవాలనిపించింది. అయితే అప్పుడు కాయంపేటలో పోతున్నాను. 'పేటలో పిచ్చోడు' అంటారేమో అని భయపడి మానుకొన్నాను.

నేను పోతున్నది రావిళ్లవారిపల్లెకు.

ఆ పల్లెకు దారి కాయంపేట దగ్గరే చీలుతుంది. తారురోడ్డు నుండి చీలిన దారి అటు కాలిదారి కాదు, ఇటు కంకరబాట కాదు. రెండింటికీ చెందని బండిబాట. ఆ బండిబాట పట్టి పోతున్నాను.

మూడు దశాబ్దాల తర్వాత ఆ పల్లెకు పోతున్నాను.

ఈ మధ్యకాలంలో దాము నెలకు కనీసం ఒకటి రెండుసార్లు వస్తున్నాడు. ఒకటి రెండు రోజులు నాతో ఉంటున్నాడు. ఆ సమయాల్లో అగ్గిపుల్లనుండి అణు బాంబు వరకు...స్వర్ణముఖినుండి స్వర్ణయుగం వరకు...రాష్ట్ర రాజకీయాల నుండి రష్యా రాజకీయాల వరకు-అన్నీ చర్చనీయాంశాలే. కొన్ని సందర్భాల్లో అభిప్రాయాలు కలుస్తాయి. మరికొన్ని సందర్భాల్లో విభేదిస్తాయి. కలిసినా, విభేదించినా అవి మా వ్యక్తిగత స్నేహాలకు ఎప్పుడూ అడ్డురాలేదు. మొత్తానికి ఆ ఒకటి రెండు రోజులు వాదోపవాదాలతో సరదాగా గడిచేది. దాము తిరిగి పల్లెకు పోతూ పోతూ-

"ఎప్పుడు నువ్వు మా ఊరికొచ్చింది? అప్పుడెప్పుడో మేంవు 'సామ్రాట్ చంద్రగుప్త' పద్దికలు చేస్తున్నప్పుడు కదా? పిలిచినపుడంతా వస్తానంటానే ఉండావు. వచ్చింది మాత్రం లేదు. కాలం గడిచిపోతానే ఉండాది. చూడబోతే నేనిక్కడికి రావాల్సిందే కానీ-ఈ జన్మానికి నువ్వా పల్లె కొంపలకు రాబొయ్యేది లేదు" అని ఎన్నోసార్లు నిష్ఠురాలాడుతూనే ఉన్నాడు.

ఎప్పటికప్పుడు పోవాలనుకోవడం. పోలేక పోవడం. ఇలానే గడిచిపోయింది కాలం. ఒక సంవత్సరమా? రెండు సంవత్సరాలా?.. ముప్పై సంవత్సరాలు! మానవ జీవితంలో గణనీయ మైన కాలం మిత్రుడి అభ్యర్థన మన్నించకుండానే గడిచిపోయింది. సిగ్గు పడవలసిన సంగతి కూడా.

ఈ ముప్పై ఏండ్ల కాలంలో చాలా మార్పులు వచ్చాయి.

స్వర్ణముఖి నదిని దాటడానికి సిమెంటు రోడ్డు నిర్మించారు. ఊరి కొక బస్సు అయింది. ఇంటి కొక బల్బు వచ్చింది. వెన్నతీసిన పాలప్యాకెట్లు వేకువజామున తలుపు తడుతున్నాయి. సారా సరఫరా అందమైన పాలిథీన్ కవర్లలో జరుగుతూ ఉంది. కంకర రోడ్లు తారురోడ్లుగా...తారురోడ్లు మరీ వెడల్పయిన రోడ్లుగా రూపాంతరం చెందాయి. బ్యాంకుల్ని జాతీయం చేశారు. జాతీయమైన బ్యాంకులు నిజాయితీగా జాతిసేవలో తలమునకలవుతున్నాయి. దేశానికి వెన్నెముక రైతుకు ఋణసౌకర్యం లభించింది. ఆంధ్ర దేశంలో 'తెలుగుదేశం' రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. ఆ పార్టీ వంద సంవత్సరాల చరిత్ర కల కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించింది. పాలక పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళ... తెలుగు బాల...తెలుగు బహిర్భూమి-ఇలా అంతా తెలుగుమయం చేసింది. కడకు ప్రకృతి ప్రసాదిత మైన గంగను కూడా తెలుగు గంగను చేసి తమిళ సోదరులకు తాగించాలని కంకణం కట్టు కొనింది. మళ్లీ కాంగ్రెస్ చేతుల్లో ఓడిపోవడంతో కట్టుకొన్న కంకణం కంకణంగానే మిగిలి పోయింది. నా రాష్ట్రం! నా ప్రజలు! అని లాగి లాగి డైలాగులు పలికిన ఎన్టీ రామారావు దేశ రాజకీయాలకు ఎగబడి రాష్ట్రంలో ఎమ్మేల్యేగా మిగిలాడు.

బండిబాట మీద పోతూ ఉంటే ఎన్నో ఆలోచనలు వంకర టింకరగా వస్తున్నాయి. పోతున్నాయి. తారు రోడ్డు మీద స్కూటర్ హుషార్ బండిబాటమీద బాగా తగ్గింది. అంటే ఒళ్లు దగ్గిర పెట్టుకొని నడుస్తున్నది.

బండిబాట ప్రక్కనే బావి. ఆ బావి గట్టున ఒక నడితరం మనిషి. మొలగుడ్డ తప్పించి పైగుడ్డ లేదు. తలగుడ్డ లేదు. సుమారుపాటి తాటిమానికి నట్టనడుమ తెల్లని బట్ట చుట్టినట్టుంది. ఉన్నట్లుండి ఒరనుండి దూసిన బాకులాగా పైకి లేచాడు. గుండె గుభేలుమనింది. నాకు తెలియకనే స్కూటర్ వేగం హెచ్చింది. ఏం చేద్దాం? నిర్మానుష్యమైన ప్రదేశం. పైగా వింటున్న సంగతులు...పత్రికల్లో చదువుతున్న వార్తలు అలాంటివే. కొంతదూరం వెళ్ళి ఆత్రత కొద్దీ తిరిగి చూశాను. అతడు గబగబ నడుస్తున్నాడు. నావైపు కాదు. మనసు స్తిమితపడింది. నా అనవసర భయానికి సిగ్గుపడ్డాను. ఊపిరి పీల్చుకోవడానికి ఒక్క క్షణం నిలబడ్డాను.

ఆ బావికి అల్లంత దూరాన కరెంట్ స్తంభం. ఆ స్తంభానికి వేలాడకట్టిన కొయ్యపలక. ఆ పలకకు బిగించిన స్టార్టర్. నడక పరుగ్గా ఆ స్తంభం దగ్గరికి పరుగెత్తిన మనిషి స్టార్టర్‌లో స్విచ్ నొక్కాడు. మోటారు తిరుగుతూ ఉంది. పంపు గుండా నీళ్లు దూకుతున్నాయి.

కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని రైతు బావిగట్టున కూర్చొని పడిగాపులు కాస్తున్నట్టుంది. కరెంటు వచ్చింది. అతని భయం అతనిది. నా భయం నాది. భయంలో నుండి పుట్టిన ఆత్రతే భయాన్ని పుట్టించింది!

పెదవుల మీద దరహాసరేఖ తన గుర్తు నిలువ లేక తనకలాడింది.

ఇప్పుడు బండిబాట మీద కూడా స్కూటర్ బ్రహ్మాండంగా నడుస్తూ ఉంది. ముందుకు పోతున్నా నా ఆలోచనలు మాత్రం వెనక్కు వెళ్లి ఆ రైతు చుట్టే తిరుగుతున్నాయి.

ఒకప్పుడు ఆమాత్రం నీళ్లు బావిలో నుండి పైకి

రావాలంటే ఎంత యాతన? మోట కట్టాల్సిందే కదా! మోట అంటే మాటలా? బానా.... మోకు... బండీ కదురుగోలు తొండందారం...కాడి...ఆ కాడి కిందికి గిత్తలు-ఇన్ని పరికరాలుంటే మోట కట్టి తోలడానికొక మనిషి. ఇందులో ఏ ఒక్కటి లోపించినా ఆ పూట పని చేటే.

ఇప్పుడు మీట నొక్కితే పాతాళగంగ పైకొచ్చి పడుతూ ఉంది.

"మరి స్వాతంత్ర్యం వచ్చింది. నలభై ఏండ్లు దాటింది. అయినా మనం ఏం సాధించాం?" అని అంటున్నారే! అంటున్న వాళ్లకు ఇదంతా అగుపడడం లేదా? ఆలోచించలేకున్నారా?

ఆ సమయంలో అటువంటి వ్యక్తి ఎవరైనా కనిపిస్తే నిజంగా నిలబెట్టి తలను వాటంగా పట్టి ఈ చెంపా ఆ చెంపా వాయించాలనిపించింది. అలా మాట్లాడకపోతే వాళ్లకు ప్రగతికాముకులన్న ముద్ర పడదని భయమేమో మరి?

ఇన్ని ఆలోచనల మధ్య దాము. నెలకు ఒకటి రెండు పర్యాయాలైనా పనిగట్టుకొని వచ్చే మనిషి. రెండు నెలలు దాటింది. మనిషి అయిపులేడు.

పల్లెకు ప్రయాణం కట్టడానికి కారణం అదే.

స్కూటర్ గుంతల్లో, మిట్టల్లో పడుతూ లేస్తూ ముందుకు పోతూ ఉంది. కాయంపేటనుండి రావిళ్లవారి పల్లెకు ఎన్ని మైళ్లు? మహా అంటే మూడు మైళ్లు. ఆ మూడు మైళ్లు స్కూటర్‌మీద ఎంతసేపు?

రావిళ్లవారిపల్లెలో అడుగు పెట్టాను.

ఈ ముప్పై ఏండ్లలో మనం సాధించిన ప్రగతి ప్రభావం ఆ పల్లెమీద పడి ఉంటుందనీ, కళకళలాడుతూ దర్శనమిస్తుందనీ...ఆ పాడిపంటల ముల్లెల్ని గురించి నా అభిప్రాయం తల్లక్రిందులయింది. ముప్పై ఏండ్ల క్రిందట నేనా పల్లెలో అడుగు పెట్టినప్పుడు సర్వశోభాయమానంగా అలంకరించుకొన్న నిండు ముత్తయిదులా దర్శనమిచ్చిన పల్లె అన్నీ తెంచేసి తెల్లకోక కట్టుకొన్న స్త్రీలా కనపడింది.

గుండె పొరల్లో ఎన్నో అనుమానపు దొంతర్లు.

అటు ఇటు కదలలేకుండా నడివీథిలో నిలబడి దిక్కులు చూస్తున్నాను. దాము ఇంటికి దారి తెలియక కాదు. ఆ పల్లె తీరును గమనిస్తూ....

"ఏవూ రబ్బేడా?"

ఊరిమీద తిరుగుతున్న చూపులు ఉలిక్కి పడ్డట్టు ఒక కొలిక్కి వచ్చాయి. ఎదురుగా వయస్సు ఎక్కి తొక్కితే నడుం వంగిన మనిషి. నెత్తిమీద కసువుమోపు.

చేతిలో ఆవు దూడ పగ్గాలు. ఆ దూడ ముందుకు లాగుతూ ఉంటే పగ్గం బిగబట్టి నిలబడ్డాడు.

"తిరుపతి."

"ఎవురింటికి?"

"దామోదరనాయు డింటికి."

"ఇంటికాడ లేడేంవేనే?"

"ఊళ్లో ఉండాడు గదా?"

ఆ తాత పకపక నవ్వాడు.

"ఎందుకు తాతా నవ్వుతున్నావ్?"

"తీరుబాటు లేకుండా పోరకలాడ్తా ఉంటేనే ఈ పల్లె కొంపల్లో బతుకులాడికాడికి, ఇంక ఊళ్లో లేకుండా బోతే? అడక్కతింటే గూడా కూడు దొరకదు. ఇవ్వేంవన్నా టవున్లా? కూసున్నచోటికే కూడొచ్చే దానికి? ఈడ పొద్దుగూకులూ పోరకలాడ్తేనే కానీ నోటికీ సేతి కందదు. నువ్వు పదబ్బారే పద! దామోదరం ఊరి కుత్తరంగా బోర్ ఎయిపిస్తా ఉండాడు. పాయ్ సూడుబో."

దూడ ముందుకు లాగుతూ ఉంటే 'దీనిగ్గూడా తొందరే' అని గొణుక్కుంటూ దూడ వెంట పడుతూ లేస్తూ పోతూ ఉంది గూని ఆకారం.

అంతవరకు నావైపు, స్కూటర్ వైపు మార్చి మార్చి చూస్తున్న చినిగిన నిక్కరు చిన్నవాడు "నాతో గూడా రా. నేన్సూపిస్తా దామోదరం ఉండే తావు" అంటూ నాకంటే ముందుగా పరుగెత్తుతున్నాడు.

ఆదే పల్లెలకు, పట్టణాలకు ఉన్న తేడా. అక్కడ అడిగినా తన్ను కాదన్నట్లుగా అంటీ అంటనట్లు ప్రవర్తిస్తారు. ఇక్కడ అడగకనే 'నేనున్నా'నంటూ ముందుకొస్తారు. ఈ సంస్కారాన్ని ఏమనాలి? ఒకచోట నాగరికత ముసుగులో కుసంస్కారం. మరొకచోట అనాగరికత నీడలో సంస్కారం. అదే ఆలోచిస్తూ ముందుకు కదిలాను.

దారిలోనే దాము ఇల్లు. ఆ ఇంటి ముందు ఒక్క క్షణం నిలబడ్డాను.

ఇంటికి తాళం వేసి ఉంది.

నా భ్రుకుటి ముడిపడింది. చూపులు కుంచించుకుపోయాయి. గుండెలో కెలికినట్లయింది. ముందుకు కదలలేకపోయాను.

ఆ ఇంటిని మూడు దశాబ్దాల క్రిందట చూశాను. మాటల కందని ఏదో కళ. చూడముచ్చటగా కనిపించింది. ఆ మారుమూల పల్లెల్లో 'సామ్రాట్ చంద్రగుప్త' పద్దికలు జరుగుతూంటే ఆ ఇంట్లో సంతర్పణ జరిగింది. ఆ సంతర్పణలో చేతులు కడిగిన వాళ్లలో నేనూ ఒక్కణ్ణి.

ఆ పల్లెలో ఆ రెండు మూడు రోజులు ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా గడిచినట్లనిపిస్తే ఆ ఇంటి పరిస్థితిని బాగా అర్థం చేసుకోవడానికి అవకాశం కలిగింది.

సహజంగానే పల్లెల్లో ఒకరి అవసరానికి మరొకరు ఆదుకొనే తత్వం. ఆ ఇంటి మట్టసానికి ఆ తత్వం మరొక్కమెట్టు పైనున్నట్టే కనిపించింది.

ఆ చుట్టు ప్రక్క పల్లెల్లో అవసరాలకు అంతో ఇంతో డబ్బు...పెండ్లిండ్లకో పండగ పబ్బాలకో పోవాలంటే నగానట్రా ఏదైనా సరే ఆ ఇల్లే శరణం.

చేబదుళ్ల కోసం వచ్చే వాళ్లతో, పొయ్యేవాళ్లతో, తీసుకొన్న అప్పుల్ని చెల్లించడానికి వచ్చిన వాళ్లతో ఎప్పుడూ ఆ ఇల్లు సందడిగా ఉండేది. ఇప్పుడు చూస్తుంటే ఆ ఇల్లేనా ఈ ఇల్లు అన్న సందేహం కలుగుతూ ఉంది.

మళ్లీ ఒకసారి చూశాను. సందేహమే లేదు. ఆ ఇల్లే! పెరట్లో కొబ్బరిచెట్లు. ఆ రోజుల్లో నీళ్లకు బదులు కొబ్బరినీళ్లు తాగించిన చెట్లు.

ఆ ఇంటి గతాన్ని తలపోస్తున్నట్టుగా మొండిగా నిలబడి ఉంది.

నా తల వాలిపోయింది.

"ఇంటికి బీగం ఏసుండేది కనపళ్లేదా? నువ్వు ఇంకా ఇక్కణ్ణే ఉండావే?"

తల పైకెత్తాను. ఎదురుగా చినిగిన నిక్కరు చిన్నవాడు.


కొంతదూరం వెళ్లి తిరిగి చూసినట్టుంది. నేను కనిపించలేదు.

పరుగుల మీద వచ్చినట్లుంది. గస పోసుకొంటూ అడుగుతున్నాడు.

ఆ పిల్లవాడికి ఏమని చెప్పాలి? చెప్పినా అర్థమవుతుందా! అందుకే 'వస్తున్నా పద బాబూ!' అంటూ బయలుదేరాను.

ఆ పిల్లవాడు మళ్లీ పరుగందుకొన్నాడు.

ఆ పిల్లవాని వెంట పడినట్టుగా స్కూటర్‌ని




ఎదురుగా వయస్సు ఎక్కి తొక్కితే నడుం వంగిన మనిషి. నెత్తి మీద మోపు, చేతిలో ఆవు దూడ పగ్గాలు.

పోనిస్తున్నాను.

ఊరు దాటగానే రిగ్ పని చేయడం కంటపడింది.

దాము భూములున్నవి ఊరిముందరే! 'వర్షాలు సరిగ్గా పడుతుంటే ఊరి వెల్లువతోనే మన కయ్యలు పండిపోతాయి' అన్న దామోదరం మాట అప్పుడు గుర్తుకు వచ్చింది.

ఊరు దాటగానే సన్నని కాలిబాట. ఆ కాలిబాట మీద స్కూటర్. పోదామా? వద్దా? అన్న సందేహం. ఆ సందేహం తోనే సాధ్యమైనంత



నిదానంగా పోతున్నాను. అప్పటికే ఆ చిన్నవాడు దాము ఉన్న చోటుకు చేరుకొన్నాడు. వార్త అందచేసినట్లుంది. చేస్తున్న పని ఆపి నావైపు చూస్తున్నాడు. తూర్పు పొద్దు కండ్లను పొడుస్తూంటే, కంటికి చేయి అడ్డంగా పెట్టుకొని వస్తున్న ది ఎవరని గమనిస్తున్నాడేమో మరి? నేను అక్కడికి చేరుకొనేటప్పటికి 'ఎన్నాళ్ల కెన్నాళ్ల'కంటూ మనిషి ఉబ్బి తబ్బిబ్బులవుతున్నాడు.

పూసిన పువ్వే అయింది అతని మొగం. ఆ మొగం

> తూర్పు పొద్దు కండ్లను పొడుస్తూంటే, కంటికి చేయి అడ్డంగా పెట్టుకుని వస్తున్నది ఎవరని గమనిస్తున్నాడేమో మరి?

నిండా చెమట బిందువులు సూర్యరశ్మి సోకి ముత్యాల్లా మెరుస్తున్నాయి. అయినా అప్పటి వేషంలో దామును చూస్తుంటే నోట మాట రాలేదు.

మొలగుడ్డ మినహా ఒంటి మీద బట్ట లేదు. ఆ మొలగుడ్డ కూడా బాగా ఎగచెక్కి గోచీ పెట్టి కట్టుకొన్నాడు.

ఒళ్లంతా చెమట కక్కుతూంది. ముగ్గుబుట్టలా పండిన తల గజిబిజిగా ఉంది. కాళ్లకు, చేతులకు బురద పులిమినట్లుంది.

'ఇతడేనా మార్క్సిజం మీది అవగాహనతో ఈ వ్యవస్థ మీద రాద్ధాంతాలు, సిద్ధాంతాలు లేవదీసే మనిషి?' అని గుడ్లప్పగించి చూస్తున్నాను.

"ఒరే నాయనా, మీ యమ్మ నొకమాట పిలవరా?"

దాము కొడుకుతో అన్నాడు. ఆ పాతికేండ్ల పడుచు వాడు చేతుల కంటుకొన్న మట్టిని దులుపుకొంటూ బయలుదేరుతున్నాడు.

చినిగిన నిక్కరు చిన్నవాడు స్కూటర్ని తాకడం తోటే తన జన్మ ధన్యమైనట్లు తలపోస్తూ స్కూటర్ ప్రక్కన నిలబడుకొన్నాడు.

రణగొణ ధ్వనితో రిగ్ పనిచేస్తూ ఉంది.

"ఏం చేసేది? చెప్పిన మాట వినదు. కాసంత ముందాడిగా నాలుగు తొలకరి చినుకులు రాల్నాయో లేదో-ఆ మనిషి పట్టుకుంటే నిలవలా. ఆ చినుకుల్నే నమ్ముకుండె. కొంపలో ఉండుంటే వరవాలేదు. కొని తెచ్చిన విత్తనాల గింజలు. రెండువేలు పోసి తెచ్చె. మట్టి మరుగు జేసె. ఇప్పుడు 'అయ్యో! కుయ్యో! మొర్రో!' అంటే ఆలకించే నాథుడెవుడు?

"అదే మన బావిలో నీళ్లుంటే, ఆ కత వేరు. ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి చెయ్యాలంటే అది జరిగే సేద్యంవేనా? మూడు నాలుగు దినాలుగా ఎదురింటోళ్ళను బతిమలాడ్తే ఈ పొద్దిటికి సరే నన్నట్టుండాది. వాళ్ల బావి ఉండేదెక్కడ? ఆమడ దూరాన. అక్కడనుండి సాగలేక సాగొస్తే కయ్యిల్లో అక్కడక్కడ గుంతలు తొవ్వి, ఆ గుంతల్లో నీళ్లు నింపి పెంకుతో చల్లుకుంటా ఉండాది.

విత్తనాల గింజల. కన్నా దక్కితే బాగుండునని దాని బాధ. పోనీ! ఈ వానను నమ్ముకుంటే అదయ్యే పని కాదు. బావి కతన్నా చూద్దామనుకుంటే నూట యాభై అడుగుల లోతుకు పొయ్యా నీటి చుక్క అందలేదు. ఇంక ఈ పల్లెల్లో బతుకులు..."

"అవును దామూ, ఒకప్పుడు ఈ బావుల్లో పుష్కలంగా ఉండెకదా నీళ్లు!"

"ఉండె. మా బతుకులూ నిమ్మతిగా ఉండె."

"మరిప్పుడేఁవయింది?"

"పుణ్యాత్ములు కట్నారుగదా కల్యాణి డాం."

"కట్టే?"

"కట్టే? స్వర్ణముఖి ఎండిపొయ్యింది. ఏరెండిపోతే మా బతుకులు ఏటిపాలే కదా? గట్టు తన్ని పారాల్సిన పనిలే. ఏడాదికొకసారి ఆ ఏరు సాగినట్టు సాగితే చాలు కదా? ఈ చుట్టుపక్క పల్లెలు నీటికి కటకటలాడింది లేదు.

అటువంటి దిప్పుడు చూస్తా ఉండావు గదా మా చావు. ఏం చేద్దాం? ఏలినవారి దయ. సేద్యానికి నీళ్ళు లేకపోతే పొయ్యింది. తాగేదానికి నీళ్లు లేకపోతే ఎట్లా?"

"అయితే తాగడానికి నీళ్ళివ్వడం తప్పంటావా?"

"తప్పనడం లేదు. ఉత్పత్తి రంగాన్ని ఉపేక్షించినారంటున్నాను."

అంతలో దాము భార్య తడి చేతుల్ని పైట చెరగుతో తుడుచుకొంటూ అక్కడికి వచ్చింది.

"కోడాలు ఏం చేస్తా ఉండాది?"

"నేను శెనిగతోటకు తడేద్దాఁవని ఎలబార్తా ఆ బిడ్డను ఆవును మేపుకు తోలమంటి."

"సరే నువ్వయినా పో. మధ్యాహ్నానికి వంట ప్రయత్నం చెయ్. ఈలోగా అంత కాఫీ పంపించు."

"దామూ-దామూ దయచేసి నా మాట విను. ఇప్పుడా ప్రయత్నాలేమీ వద్దు. అన్నీ తీసుకొనే బయల్దేరాను. నేను వెంటనే వెళ్ళాలి కూడా."

"రాక రాక వచ్చినావు కదా? ఒక పూట ఉండిపో రాదా?"

"లేదు దామూ. మధ్యాహ్నానికి ఇల్లు చేరవలసిన అవసరం ఉంది. రెండు నెలలుగా నువ్వు కనిపించకపోతే..."

నా మాట పూర్తి కాలేదు. గుండెని చీల్చినట్టుగా 'అమ్మా!' అన్న ఆర్తనాదం. ఉలిక్కి పడ్డట్టుగా అందరి దృష్టి అటు మళ్లింది. కాలు క్రింద. ఇనుప దిమ్మె పైన. కూలిమనిషి 'కుయ్యో! మొర్రో!' అని అరుస్తున్నాడు.

ఒక్క ఊపులో దాము వాడి దగ్గరికి పరుగెత్తాడు. కొడుకు అప్పటికే అక్కడికి చేరుకొన్నాడు.

ఇద్దరు పట్టి ఇనుప దిమ్మెను ప్రక్కకు తీశారు. అయితే వాడి కాలు విరిగింది.

రిగ్ పని చేస్తున్నప్పుడు ఇనుప రాడ్స్ వేస్తూ రావాలట. దాము, కూలిమనిషి ఇద్దరూ కలిసి ఆ పని చేస్తున్నారు.

అయితే ఇప్పుడు దాము నాతో మాటల్లో పడిన కారణంగా వాడొక్కడే ప్రయత్నించాడు.

పట్టు తప్పింది. ఇనుప దిమ్మె కాలిమీద పడింది. కాలు విరిగింది.

నేను రాకుండా ఉంటే ఈ ఘోరం జరిగేది కాదు కదా అన్న భావనతో నా గుండె బాధగా మూలిగింది.

రిగ్ పనిచేయడం ఆగింది. అందరూ వాడి చుట్టూ చుట్టుకొన్నారు. తలకొక విధంగా సముదాయిస్తున్నారు. అయినా వాడు విపరీతంగా అరుస్తున్నాడు.

పుత్తూరు శల్యవైద్యుడి దగ్గరికి తీసుకపోవడం బస్సులోనా? బండిమీదనా? అని తర్జనభర్జనలు పడుతున్నారు.

క్షణాల్లో ఈ వార్త ఊళ్లో ప్రాకింది.

వాడి పెళ్లాం, పిల్లలు 'కుయ్యో మొర్రో!'అని మొత్తుకొంటూ పరుగులమీద అక్కడికి చేరుకొన్నారు.

"అయ్యయ్యో! ఎంత పన్జేసినావురా దేవుడో? నీకు మాబోటి పేదోళ్లే దొరికినార్రో దేవుడో? మామీద నీకెందుకింత కసిరా దేవుడో? ఇంక ఈ లేదర బిడ్డెల పెట్టుకోని, ఈ కాలిరిగిన మణిసిని కొంపలో యేసుకోని నేను ఎట్టాగ బోతాన్రో దేవుడో!" అంటూ వాడి పెళ్లాం పాడి పాడి ఏడుస్తూ ఉంది.

దాము వాళ్లను సముదాయిస్తున్నాడు. వాళ్లు వినకుండా పడి పడీ ఏడుస్తుంటే విసుక్కొంటున్నాడు. కొడుకును బండి కట్టమని పురమాయిస్తున్నాడు.

నా పని ముండ్లమీద నిలబడుకొన్నట్లుంది. ఆ వాతావరణాన్ని భరించే శక్తి నా గుండెకు లేదు.

ఆ పరిస్థితిలో మిత్రుడిని వదిలి వెళ్లడానికి మనసు రాలేదు.

"వాడికి కోడినెత్తురు, సారాయి కలిపి తాగిపించండి."

ఎవరో సలహా ఇచ్చారు. ఆ మాటతో కూడా దాము ఊళ్లోకి పరుగెత్తాడు.

నేను అదే అదననుకొన్నాను.

అక్కడినుండి ఎలాగో బయట పడితే చాలు అనిపిస్తూ ఉంది. ఎవరి హడావిడిలో వాళ్లుంటే నేను మెల్లగా అక్కడినుండి జారుకొన్నాను.

స్కూటర్ తోసుకొంటూ ఊళ్లో మెల్లగా నడుస్తున్నాను.

ఆ వేళప్పుడు ఎవరో ఒకావిడ పాలు పిండుతూ ఉంది.

ఆరేడేండ్ల పిల్లవాడు. కాళ్లూ చేతులు పుల్లల్ని తలపింప చేస్తున్నాయి. పొట్టమాత్రం గాలి ఊదిన బెలూన్‌లా ముందు కొచ్చింది.

చేతిలో నత్తులోటా... బుంగమూతి. చూపులు మాత్రం పిండుతున్న పాలమీద.

"నీకు కాదంట్రా చెప్పేది తిండి పోతూ! యాళగాని యాళ. ఈ గొడ్డు పితికేది గూడా ఆడికాడికే ఉండాది. నడిమిద్దె నీ పొటుకు. నిన్న దూడకు కూడా యిడ్సిపెట్ట కుండా పిండితే రొండు లీటర్లకు దోసిడు పాలు తక్కవాయె. ఈ పొద్దునకు ఈ యాళగాని యాళ కాడ పిండి లోటా పాలు పోస్తే ఇంక బత కేడ్సినట్టే!"

వాడు లెఫ్ట్ రైట్ కొడుతూ ఏడుపు అందుకొన్నాడు

ఆమె శాపనార్థాలు పెడుతూ ఉంది.

నా గుండె కలుక్కుమనింది.

ఎదురుచూడని చేదు అనుభవాలు. గుండె బరు వెక్కింది. తల వాలిపోయింది. అడుగుల్ని లెక్క పెడుతున్నట్టుగా అడుగుమీద అడుగ్గా ఊరు దాటుకొన్నాను. అప్పుడు స్కూటర్ స్టార్ట్ చేసి కూర్చున్నాను.

దానికి కూడా నా బాధ అర్థమైనట్టుంది. మెల్లగా ముందుకు సాగుతూ ఉంది.

వయసు పైబడడంతో వంగిపోయిన గూని మనిషి...క్షణం తీరిక లేని బ్రతుకులో దాము... కాలు విరిగిన కూలిమనిషి... చారెడు పాలకు నోచుకోలేని భావి భారత పౌరుడు. నన్ను వెన్నాడుతూనే ఉన్నారు.

నలభై ఏండ్ల స్వాతంత్ర్యంలో సాధించిన ప్రగతికి ప్రతీకలా వీళ్లంతా? ఇప్పుడు ఎవరు ఎవరి చెంప వాయించాలి? అని మనస్సు నిలదీసి అడుగుతూ ఉంది.

ఏమని సమాధానం చెప్పాలి? సిమెంటు రోడ్లు... ఎర్రబస్సులు... బల్బులు ప్రగతి సాధనలో భాగమే కావచ్చు. కానీ అవే ప్రగతికి నిదర్శనాలు కావుకదా? వస్తూ ఆలోచించాను. పోతూ ఆలోచిస్తున్నాను. ఆలోచనకు, ఆలోచనకు మధ్య ఎంత తేడా?

ఈ తేడాలకు కారణం అనుభవం. ఈ అనుభవం నాలుగు గోడల మధ్య దొరికేది కాదు.

పుస్తకాల్లో లభ్యమయ్యేది కాదు. ముప్పై ఏండ్ల అమూల్యమైన కాలం గది గోడలకు పరిమితం కావడం మూర్ఖత్వమా? అమాయకత్వమా?

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఎదురుగా దాము.

"చూసినావు కదా నా బతుకు. నేను... నా పెండ్లాం... నా కొడుకు... నా కోడలు... ఇంటిల్లిపాదీ క్షణం తీరికలేకుండా సతమతమవుతున్నాం. అయినా శ్రమకు తగిన ఫలితాన్ని అనుభవించ గలుగుతున్నామా? అదే ఒక ఉద్యోగి అయితే ఒక్కడు ఎనిమిది గంటలు పనిచేస్తే చాలు. ఇంట్లో అందరు కాలు మీద కాలేసుకొని కమ్మగా మూడు పూటలు తినగలుగుతున్నారు. ముప్పై ఏండ్ల తరువాత రాక రాక వచ్చావు. పదినిమిషాలు తీరిగ్గా కూర్చొని నీతో మాట్లాడగలిగానా? లేదే? పట్టెడన్నం పెట్ట గలిగానా? లేదే. అదే ఒక ఉద్యోగి దగ్గరికి పొయ్యుంటే? కలం మూసిపెట్టి క్యాంటీన్లో కాఫీ తాగుతూ కమ్మగా కబుర్లు చెప్తూ కూర్చొనేవాడు. ఇది ఉత్పత్తి రంగం. ఎంత ఉపేక్షకు లోనయిందో ఆలోచించు."

దామును ప్రక్కకు నెట్టి గూని మనిషి ముందుకు వచ్చాడు.



కలం పట్టిన ప్రతి కవీ,
ఖద్దరు కట్టిన ప్రతి నాయకుడూ
రైతు దేశానికి వెన్నెముక
అని అరుస్తున్నారు.

"ఒరే అబ్బోడా! యాడైనా వొకసోట వొక బంట్రోతు ఉద్దోగానికి కుదురుకోనుంటే ఈ బతుక్కంటే అది ఎన్నో రెట్లు మేలు గదా? ఉద్దోగంలో సేరాలంటే మైనరు తీరాల. యాభై ఎనఁవిదేండ్ల దాకా అట్టా నెట్టుకోనొస్తే సాలు. వాళ్లే ఇంటికి పొమ్మంటారు. ఈడ బతుకట్టా కాక పాయ్‌నే. పుట్టి బుద్దెరిగిన నాట్నుండి ఇద్దో ఇట్టా మాదిరి పీకులాటే! ఈ వయసులో కూడా ఏదో వొక పన్జేస్తేనేకానీ అంత సంకటెయ్‌నంటా ఉండారు. అదే వొక బంట్రోతు ఉద్దోగయ్యుంటే? ఇప్పుడు పించను తీసుకుంటూ హాయిగా రాఁవా గోయిందా!' అంటా కాలచ్చేపం సేసేటోణ్ణి కదా? అవునో కాదో నువ్వే జెప్పు?"

ఏమని చెప్పేది?

"ఒరే ముసిలోడా! నీదేఁవుండాది? పొద్దు గూట్లో పడబోతా ఉండాది. ఇంకా నీకత లెందుకులే! నాకత యినమను!" అంటూ కూలిమనిషి గూని మనిషిని వెనక్కు నెట్టి ముందుకొచ్చాడు.

"అయ్యా! సదువూ గ్నానం ఉన్నోళ్లు. మంచీ సెడ్డా ఎరిగిన మహన్నబావులు. తఁవరే సెప్పండి నాయం. నేసేస్తా ఉండింది డ్యూటీ కాదు. తెల్లకాగితం మింద నల్ల గీటేసే మణిసి సేసేది మాత్రం డ్యూటీ. ఆ మణిసికే యిటువంటి ఆపద జరిగుంటే? పోనీ సస్తే-కాల్సేదానికో పూడ్సేదానికో ఎంటనే దుడ్లిస్తారు. పెండ్లానికో బిడ్డలకో ఉద్దోగాలిస్తారు. అప్పిటికప్పుడే పదేలు బిల్ ముక్తాగా చెల్లిస్తారు. మాబోటోళ్ళకు నడుఁవులిరిగినా, సేతు లిరిగినా, కడాకు సచ్చినా పట్టించుకుండే నాదుడెవురు?"

ఎలా వచ్చాడో సత్తులోటా పిల్లవాడు. వీళ్ల సందుల్లో దూరి ముందు కొచ్చాడు. బుంగమూతి పెట్టి ఖాళీ సత్తులోటా చూపిస్తున్నాడు.

"ఇంట్లో ఏ ఒక్కడో ఉద్యోగం చేస్తే చాలు. ఆ ఇంట్లో అందరికీ ఉదయం, సాయంకాలం కూడా లోటా పాలకు లోటుండదు. అదే మా ఇంట్లో? ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది తలా ఒక పని చేస్తున్నారు. ఆవు మాదే. మేపింది మేమే! అయినా నాకు లోటా పాలకు గతి లేదు!" అని అడుగు తున్నట్లుంది.

నలుగురు నాలుగు వైపుల నుండి నన్ను చుట్టు ముట్టారు. "చెప్పు! ఏమి సమాధానం చెప్తావో చెప్పు!" అని నిలదీస్తున్నారు.

ఏమని చెప్పను?

కలం పట్టిన ప్రతి కవీ...ఖద్దరు కట్టిన ప్రతి నాయకుడూ 'రైతు దేశానికి వెన్నెముక' అని అరుస్తున్నారు.

శరీరంలో వెన్నెముక వెనుకన ఉంది. రైతు కూడా దేశానికి వెన్నెముక కాబట్టి వెనుకబడే ఉన్నాడు. అలాంటప్పుడు ఎవరికైనా రైతు దేశానికి వెన్నెముక అనడానికి అర్హత ఉందా?

'లేదు. వీళ్లు అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేవరకు ఏ వెధవకూ ఆ అర్హత లేదు. లేనేలేదు' అని గొంతెత్తి అరవాలనిపించింది.

అప్పుడు నేను స్వర్ణముఖిని దాటుతున్నాను. ఎర్రబస్సు ఎదురుగా వస్తూ ఉంది. ఈ ఎర్ర బస్సులు..... సిమెంటు రోడ్లు... పల్లె పల్లెల్లో కాంతి వంతమైన దీపాలు... మీటనొక్కితే పాతాళ గంగలు అన్నీ సాధించిన ప్రగతికి నికరంగా నిదర్శనాలే! అయితే ఈ ప్రగతి ముసుగులో జీవన గతులు? ఆ జీవన గతులకు మూడు దశాబ్దాలకు మునుపు ఇనుప సంకెళ్లు! ఇప్పుడు బంగారు సంకెళ్లు.

ఈ వ్యవస్థలో ఆలోచించకూడదు. కాదని ఆలోచించిన వాడొక పిచ్చివాడు.

ఉన్నట్లుండి స్వర్ణముఖిలో సుడిగాలి లేచింది. ఇసుక రేణువులతో నా చెంపలు అదరగొట్టింది.

ఇలా ఆలోచించినందుకు ఫలితమేమో మరి! ●